విందు వంటకాలు

కె. బి. ఎస్. కుమార్

ఈ వూళ్ళో వంటలు బ్రహ్మాండంగా చేసే వ్యక్తుల్లో రామచంద్రుణ్ణి మొదటి వాడుగా చెప్పుకోవచ్చు. ఈ వూళ్ళోనే కాదు, చుట్టు ప్రక్కల వున్న వూళ్ళన్నీ కూడ రామచంద్రుణ్ణి వంటలయ్యగా బాగా స్నేహం చేసుకున్నాయి. ఎవరి పెళ్ళి జరిగినా వంటలు చెయ్యటానికి ముందుగా రామచంద్రుణ్ణే కన్సల్టు చేస్తారు అందరూ. రామచంద్రుడు 'కాల్ షీటు' ఇవ్వకుంటే చప్పగా నిట్టూర్చిగాని అవతలివాడి వద్దకి పోరు.

పెళ్ళికీ, తద్దినానికీ, బారసాలకీ, గృహప్రవేశాలకీ, ఆలయాల్లో దేవుడి ప్రతిష్ఠలకీ - ఒకటేమిటి? ప్రతి ఫంక్షనుకీ రామచంద్రుడికి పిలుపు వస్తూంటుంది.

ఆ రామచంద్రు డెవరో కాదు, నేనే!

మా బామ్మ వంటలు చేసేదిట. మా నాన్న వంటలు చేసి మమ్మల్ని పోషించాడు. ప్రస్తుతం ఆ వృత్తిలో నేను దిగాను.

నిజానికి మా నాన్నకి నన్ను బాగా చదివించాలని మహా యిదిగా వుండేది. కాని నన్ను యెక్కువ చదువు చదివించే స్తోమత ఆయనకి లేదు. అంచేత నేను స్కూల్ ఫైనల్ వరకు మాత్రమే చదవ గలిగాను, లెక్కల్లో పోయింది. మళ్ళీ కట్టమన్నాడు నాన్న. నేనే వద్దన్నాను.

అప్పటికి నా చెల్లెలు సునీత ఎనిమిది చదువుతోంది. తమ్ముడు సుధాకర్ ఆరవ తరగతి.

అమ్మకి ఎప్పుడూ ఏదో ఒక జబ్బు వస్తోంటుంది. ఆమెకు ఉబ్బస వ్యాధి వుంది. అది తరచూ క్రొత్త రోగాలను కొనుక్కొంటుంటుంది. అది ఆమె తప్పు కాదు.

ఒకసారి నాన్నకి హైదరాబాదుకి పిలుపు వచ్చింది. ఈ వూరి అమ్మాయిని హైదరాబాదు కిచ్చారు. అబ్బాయి డాక్టరు. కన్యదాత స్వగృహంలోనే వివాహం జరిగింది. అంటే ఈ వూళ్ళోనే నన్నమాట.

ఆ పెళ్ళికి మా నాన్నే వర్కు చేశాడు.

మా నాన్న వంటలు రుచి చూసిన పెళ్ళికొడుకు తరఫు వాళ్ళు సిటీలో వాళ్ళరేంజ్ చేసిన రిసెప్షన్‌కి మా నాన్నే స్వీట్సూ వగైరాలు చెయ్యాలన్నారు.

అంగీకరించక తప్పలేదు నాన్నకి.

నాన్నకి అమ్మ అసిస్టెన్స్ ఇస్తుంది. అంటే కూర గాయలు తరగడం, బియ్యం వగయిరాలు కడగటం మొదలయినవి. నీళ్ళు తేవటం, విజిటబుల్స్‌ని సెపరేట్‌గా బాయిల్ చెయ్యటం వగయిరా పార్ట్‌టైమ్ డ్యూటీలు నావి.

పెళ్ళికూతురు తండ్రి మా నాన్నగారికి సన్నిహితుడు కావటంతో రిసెప్షన్‌కైనా ఒప్పుకున్నాడు గాని - లేక

పోతే ఒప్పుకునేవాడు గాదు ఆ రేటుకి.

ఎందుకంటే అదే రోజు నా పరీక్ష. ఆఖరు పరీక్ష.

వృత్తి ధర్మాన్ని ఎగగొడితే భుక్తి జరగదు కాబట్టి పరీక్ష మానేసి హైదరాబాదు రైలు ఎక్కాల్సి వచ్చింది అందరమూ.

అలా ఆనాడు నా పరీక్ష పోయింది.

మళ్ళీ కట్టలేదు నేను.

అమ్మ ఆరోగ్యం కృష్ణపక్ష చంద్రుడిలా అయిపోతోంది. నాన్న కూడ మెత్తబడుతున్నాడు. భావి యజమానినైన నేను నా చెల్లెల్ని, తమ్ముడ్ని యెలా పోషించాలి? ఎక్కువ చదివే స్తోమత లేదు. చదివిందానికి ఉద్యోగార్హత లేదు.

అంచేత నాన్నకి 'అసోసియేట్'గా చేరిపోయాను.

బహుశ నాన్నకూడ నాకు మల్లే ఆలోచించారేమో, అభ్యంతర పెట్టలేదు.

ఎనిమిదేళ్ళు గడిచాయి. ఈ ఎనిమిదేళ్ళలో నాకు సంబంధించి చాలా మార్పులు జరిగాయి. ఉబ్బసవ్యాధి అధికమై మంచం పట్టిన మా అమ్మ ఓ రోజు తెల్లారేసరికి 'బొమ్మ'గా, ఆ మధ్యాహ్నానికి బూడిదగా మారిపోయింది. ఆ తర్వాత నాలుగేళ్ళకి మా నాన్న—ఓ రోజున పదిహేను కిలోల బియ్యం ఉడికే గుండిగని గంజి వంచటంకోసం నాతోబాటు దింపుతూ గుండె పట్టుకొని—గంజి అంతా జారేలోగా ఈ లోకంనుండి జారుకున్నాడు.

తండ్రిని మించిన తనయుడిగా నాకు పేరు ప్రతిష్ఠలు వచ్చేశాయి.

సుధాకర్ అతి కష్టంమీద టెన్తు పాసయి—పుష్టిగా

ఎత్తుగా ఎదగటంతో ఎర్ర టోపీ కాన్‌స్టేబుల్‌గా సెలక్టయి — ప్రస్తుతం అనంతపురంలో ట్రెయినింగు పొందుతున్నాడు.

సునీత. మిగిలింది సునీత బాధ్యత ఒక్కటే. అది యింటర్ పాసయింది. ఈ ఊళ్ళోనే మహిళామండలి వాళ్ళు స్థాపించిన స్త్రీల కుట్టు సెంటర్‌కి పోతోంది.

తన జాకెట్లూ చీరలకి అంచులూ ఫాల్సూ మొదలైనవన్నీ తనే కుట్టుకునేది. ఇరుగుపొరుగు అమ్మలక్కల దుస్తులుకూడా కుట్టేది. అందుకే దానికో కుట్టుమిషన్ కొనిచ్చానుగూడ.

ముఖ్యమైన బాధ్యత ఒకటి వుంది—దాని పెళ్ళి. మంచి రోజు చూసి దాన్నో అయ్యచేతిలో పెడితే ఇక నాకే చింతా వుండదు.

కాని టైమ్ దొరికేది కాదు నాకు. నా కళ్ళెదురుగా ఎన్నో పెళ్ళి ముహూర్తాలు జరిగిపోతున్నాయి. అన్నీ పారిపోతున్నాయి. వాటికి వర్కు చెయ్యవలసిందిగా ఆర్డర్లు రావటంతో నా చెల్లికి వరుణ్ని చూసే తీరిక, వివాహంచేసే వ్యవధి దొరికేది కాదు నాకు.

ఆనాడు మా నాన్న స్థోమతలేక నన్ను చదివించలేక పోయాడు. ఈనాడు నేను తీరికలేక సునీత పెళ్ళి చెయ్యలేక పోతున్నాను. ఈ విషయంలో మాత్రం నేను పేరు ప్రఖ్యాతులు ఇనుమడించిన వంటలయ్యాని తప్ప అని తృప్తిపడలేక పోతున్నాను.

కాని ఆ బాధకూడా లేకుండా చేసింది సునీత.

తనెవర్నో ప్రేమించిందిట. అతను లేకపోతే తను బ్రతకలేదుట. అతడి వివరాలు నాకు నచ్చవుట.

అంచేత.... నా చెల్లెలు అతడితో లేచిపోయింది.

ఆ విషయం గుర్తువచ్చినప్పుడంతా నా కళ్ళు తడుస్తూనే వున్నాయి. అంటే నెల రోజుల్నుండీనన్నమాట.

కాని అవన్నీ కేర్ చెయ్యను. వుల్లిపాయ తరుగుతున్నప్పుడు కళ్ళనీళ్లు వస్తుంటాయి. ఈ నీళ్ళు ఆ బాపతేననుకొని సర్దుకుపోతూంటాను.

ఎందుకంటే అదే మనసులో వుంచుకొని బాధపడుతోంటే కూరల్లో ఉప్పు పాళ్ళలో కారమూ కారం పాళ్ళలో పసుపూ పడతాయి. అప్పుడు నా వృత్తిలో నాకు చెడ్డపేరు వస్తుంది. ప్రిస్టేజితో పాటు ఇమేజికూడా పోతుంది.

అలాగని చెల్లిపై ప్రేమలేని వాడిననిగాదు.

దీన్ని పౌరుషం అంటారనుకుంటాను.

ఇన్నేళ్ళుగా పెంచి చదువూ అదర్ క్వాలిఫికేషన్సూ చెప్పించి — లడ్డు నేనైతే నాలోని తియ్యదనం నా చెల్లెలుగా మా మధ్య పెనవేసుకున్న ప్రేమని విస్మరించి నా తోడబుట్టిన చెల్లెలు—నా సునీత—నన్ను వదిలి—మరచి—ఎవడితోనో లేచిపోయింది. పాకంలో కాక—పక్కన వేసిన బూందిలా చప్పగా మిగిల్చిపోయింది.

కాని నేనలా మిగిలిపోలేదు. ప్రస్తుతం ఈ చప్పిడి బూంది 'వృత్తి ధర్మం' అనే కారప్పొడిని పులుపుకొని కారబ్బూందిగా మారిపోయింది. అందుకే రుచిగా వుంది. రుచిని పంచుతోంది!

కాని నా చెల్లెలు ఒక వెర్రివాడిని ప్రేమించినా. (అయినా అలాంటివాణ్ని నా చెల్లెలు ప్రేమిస్తుందా) వాడికివ్వటానికి వెనుదియ్యానని దానికి తెలీదు పాపం!

మొత్తంమీద నేను ఒంటరి వాణ్ణయిపోయాను. కొన్ని రోజులు చాల కష్టమనిపించింది. అయితే ఈ

ఒంటరితనం వంటల్లో కాదు, జీవితంలో.

వృత్తి విషయంలో నాకు నలుగురు అసిస్టెంట్లున్నారు. మొదటి వ్యక్తి యంగ్ విడో, పేరు లక్ష్మి. రెండో వ్యక్తి సరోజిని, మూడో వ్యక్తి పద్మశ్రీ. పదహారేళ్ళ పడుచు. మొన్నటి వరదల్లో వున్న తల్లి పోయి అనాథైంది. నాలుగవ వ్యక్తి జిడ్డుగాడు. వాడు నాకు కుడి భుజం.

నేను పేరుకి మాత్రమే శ్రీరామచంద్రుణ్ని. పేరుకి మాత్రమే శ్రీరామచంద్రుణ్ని గాబట్టి ఆ ముగ్గురితోనూ అడ్జస్టయిపోతుంటాను అవకాశాన్నిబట్టి. ఆ విషయంలో నే సరోజిన్ని అనుమానించి ఆమె భర్త ఆమెని వదిలేశాడని నా అనుమానం.

అయినా తాగొచ్చి రోజూ పెళ్ళాన్ని కొట్టక శాస్త్ర ప్రేమతో చూసుకుంటే వ్యవహారం నాదాకా యెందు కొస్తుంది అనుకొని యిందులో నా పాపం ఏమీ లేదని సర్దుకుపోతుంటాన్నేను.

ఈ అడ్జస్టుమెంటు విషయం ఒకరికొకరుగా ముగ్గురికీ తెలుసు. అయినా వాళ్ళు ఏమీ అనరు—అనుకోరు.

జిడ్డుగాడికి పదమూడేళ్ళు. వాడి తల్లి ప్రస్తుతం జైల్లో వుంది. ఎవరైనా పిల్చి రెండు సీసాలు కళ్ళు ఇప్పిస్తాను. నీ పెళ్ళాన్ని ఓ రోజు నా గదిలోకి పంపు అంటే 'ఓ య్యస్' అనే మొగుణ్ని—గొడ్డలితో 'నరికిన' ఘోర నేరానికి ఆమె శిక్ష అనుభవిస్తోంది.

జిడ్డుగాడు ఒంటరివాడు కావటంతో వాణ్ని నేనే చేరదీశాను.

నేను బాగా తింటున్నాను. నలుగుర్ని ఏ లోటూ లేకుండా పోషిస్తున్నాను. పాస్ బుక్ లో పాతిక వేల

దాకా వుంది.

ఉద్యోగంలో చేరివుంటే యింత సుఖంగా వుండే వాణ్ని కాదేమో....

2

ఎవరో తలుపు తడుతూండటంతో గత స్మృతుల్లోంచి తేరుకున్నాను. తలుపు తెర్చాను.

జిడ్డుగాడు.

“ఏరా వచ్చావ్! అప్పుడే మేట్నీ వదిలేశారా?” అన్నాను.

“నీకోసం అప్పారావు వచ్చాడు బావా!” అన్నాడు వాడు.

“అప్పారావా!? వాడెవడు?”

“ష్....” అని — ప్రక్కనే ఉన్నట్టు సైగచేశాడు జిడ్డుగాడు.

అప్పుడు చూశాను, జిడ్డుగాడికి అవతలి ప్రక్కన ఓ శాల్తీని. ముప్ఫయ్ అయివుంటుంది వయసు. చదువుకున్న మనిషిలా వున్నాడు. ఆడపిల్ల కాదు గాబట్టి అంతకు మించిన వర్ణన అనవసరం.

అప్పారావనే స్నేహితుడు నాకెవరూ లేరనీ, జిడ్డుగాడు ఎవరో ఫ్రెండు వచ్చాడని చెప్పినట్టు చెబితే అసహనంగా అలా అన్నాననీ మరోలా అనుకోవద్దనీ, చెప్పి మర్యాదగా అతన్ని లోపలి కాహ్వానించాను, జిడ్డుగాడి నెత్తిన ఒక్కటి వేస్తూ.

అతన్ని కుర్చీలో కూర్చోబెట్టి సీలింగ్ ఫ్యాన్ ఆన్ చేసి, వచ్చిన కారణం ప్రశ్నించాను.

“పెళ్ళి సందర్భంగా మీరు అయిటమ్స్ ప్రిపేర్ చెయ్యాలి” అన్నాడతను.

నాకు నవ్వొచ్చింది. "అయ్యా! ఇది ఆషాఢ మాసం. ఇప్పుడు పెళ్ళేమిటి?" అన్నాను.

అందుకు అప్పారావు కూడ నవ్వుతూ "పెళ్ళి గత మాసమే సింపుల్ గా జరిగిపోయింది. పెళ్ళికొడుకు మా వాడే. అయ్ మీన్ స్నేహితుడు. ఆదర్శ వివాహం చేసుకున్నాడు."

"పెళ్ళి జరిగిన నెలకా పార్టీ ఇచ్చేది?"

"అయ్యా! ఆషాఢం నిన్నటి నుండే మొదలయింది. ఆ లెక్కన గత నెల అన్నాను. నా భాషలో పెళ్ళి జరిగి వారమయింది. మేమంతా మాట్లాడుకొని రేపు సాయంత్రం 6 గంటలకి పార్టీ ఇవ్వాలనుకున్నాం."

"ఎంతమంది?"

"దాదాపు మూడువందల మంది."

"ఏదయినా హోటల్లో ఆర్డరివ్వొచ్చుగా!"

"ఒక వంటవాడు ఇచ్చే సలహా కాదిది."

"ఒక సగటు వంటవాడి మనసు కాదు నాది."

నా మాట కతను దిమ్మెరపోయాడు. నవ్వుతూ చూశా నతన్ని. "చూడండి మేష్టారూ! ఈ ఆఫరు నాకు నచ్చ క్కాదు నే నా సలహా ఇచ్చింది. నా మూలంగా మీరు సఫర్ కాకూడదు."

"రామచంద్రుడూ! మా ఇంటి ప్రక్కన దుకాణ ముంది. అందులో బన్స్ వుంటాయి. నా కొడుక్కి ఉదయం ఏడుకి బన్ తో సహా పాలగ్లాసు ముందర పెట్టక పోతే వాడు ఇల్లు పీకి పందిరేస్తాడు. అయినా నేను ఆరున్నరకే సైకిలుపై వెళ్ళి అరమైలు దూరంలో వున్న కార్ఖానా నుండి బన్స్ తెచ్చి వాడికి ఇస్తాను."

అప్పారావు అభిరుచి నా కర్థమైంది.

"పైగా రెణ్నెల్ల క్రితం నువ్వు రిటైర్డు డిసిటివో గారి మనవరాలి పెళ్ళిలో చేసిన అయిటమ్స్ మావాడెంతో నచ్చాయి. అదీ ఓ కారణమే!"

నా ఛాతీ ఉబ్బింది.

"సరే. ఏమేం చెయ్యాలి?" అడిగాను జేబులోంచి కేప్స్టన్ తీసి అతని కాఫర్ చేస్తూ.

అతను మృదువుగా తిరస్కరించి జేబులోంచి విల్స్ ఫ్లాక్ తీశాడు. ఎవరి బ్రాండ్ వాళ్ళం వెలిగించుకున్నాం.

"హాట్ విజిటబుల్ బిరియాని. స్వీట్ యేం చేస్తే బావుంటుందో నువ్వే సజెస్టు చెయ్యి" అన్నాడు అప్పారావు.

"చీపుగా పోవాలంటే మైసూర్ పాక్ చేద్దాం. లేదా జిలేబి చెయ్యొచ్చు. అదీ చీప్పే."

"పోనీ జాంగ్రీ చేస్తే?"

"చెయ్యొచ్చు" అన్నాను.

"మా వాడికి జాంగ్రీ చాల ఇష్టం" అన్నాడు అప్పారావు.

"ఎన్ని?"

"వెయ్యి."

"అలాగే!"

"నలభై కేజీల బియ్యం సరిపోతాయా విజిటబుల్ బిరియానికి?" సందేహంగా అడిగాడు అప్పారావు.

"ఎక్కువవుతుంది."

"ఉండనివ్వు. కొంతమంది యిళ్ళకి పంపాలి."

"మీ యిష్టం!"

"ఏమివ్వాలి?"

ఒక నిమిషం ఆలోచించాను. "మా గ్రూపు మొత్తం నలుగురు - నాతో కల్సి, రానూ పోనూ ఛార్జీ లివ్వాలి. ఆహార పానీయాలు మీతో బాటు మేమూ. పారితోషికం అయిదువంద లవుతుంది."

"చాలా ఎక్కువ చెబుతున్నావు. మూడు చేసుకో."

"సారీ! జాంగ్రీ చాల శ్రమతో చెయ్యాల్సి వస్తుంది. వెయ్యి పీసులు పిండే సరికి చెయ్యి పడిపోతుంది. గ్రైండరు పనికిరాదు. చేత్తోనే రుబ్బాలి. పిండి పేస్టులా మెత్తబడాలి. నిలువ వుంచకుండా, ఆలస్యం చెయ్యకుండా వేస్తూండాలి. ఒకరు రఫ్‌గా రుబ్బుతోంటే మరొకరు సాఫ్ట్‌గా రుబ్బాలి. ఒకరు పాకంలో డిప్ చేస్తోంటే, ఒకరు జాంగ్రీ వేస్తూండాలి. జాంగ్రీ ఒప్పుకుంటే ఆ మర్రోజు మేం కంప్లీటుగా రెస్టు తీసుకోవాల్సి వస్తుంది తప్పనిసరిగా."

"సరే. అవన్నీ నా కర్థం కావు. ఇదిగో, వంద అడ్వాన్సుగా వుంచు. ఎప్పుడు బయలుదేరుతారు?"

"రేపు ఉదయం ట్రెయినుకి వస్తాము. ఎవరో ఒకరు స్టేషన్‌లో మమ్మల్ని రిసీవ్ చేసుకోండి. ఫాలో అవుతాము" అన్నాను సిగరెట్ పీకని పారవేస్తూ.

"అలాగే. మరి ప్రావిజన్స్ లిస్టు."

"ఉదయం స్టేషన్‌లోనే అందిస్తాను."

"ఓకే. మరి నే వస్తాను."

"ఒక్క నిమిషం. మీ అకేషనూ, అడ్రసూ, ఇచ్చిన అడ్వాన్సూ ఇందులో వ్రాయండి" అన్నాను డైరీ తెచ్చి అతని ముందు పెడుతూ.

3

"మనకి డిమాండ్ పెరుగుతోందక్కా" అన్నాడు జిడ్డుగాడు.

సరోజిని చిన్నగా నవ్వింది.

"మీ బావకు అన్నీ తెలుసు గాని లౌక్యం తెలియదురా" అంది పద్మాక్షి.

"తెలీకపోయినా నెట్టుకొస్తున్నాడంటే దాంతో అవసరం లేదనే అన్పిస్తోంది కదక్కా" అన్నాడు జిడ్డుగాడు.

లక్ష్మి అందుకుంది. "అది కాదురా! మన బృందమే కావాలన్నారు వాళ్ళు. అలాంటప్పుడు మరో వంద ఎక్కువ చెప్పివుంటే ఎంత బావుణ్ను?"

"పోనీ అలా కావన్నా మీరు తెచ్చే మినపప్పు బావుండదు. మేమే పట్టుకొస్తామని చెప్పివుంటే."

"మనం ఒకటి రెండు కిలోలు మిగిలించుకోవచ్చు" గంభీరంగా అంటూ ప్రవేశించాన్నేను. "అది ఎదుటి వ్యక్తిని మోసం చెయ్యటం అవుతుంది. మిగతా వారి కంటే పాతికో, పరకో ఎక్కువగా తీసుకుంటాడు రామచంద్రుడు. కాని ఎవ్వర్నీ మోసం చెయ్యడు. బాతాఖానీలు చాలించి నడవండి. ట్రెయినుకు టైమైపోతోంది" అన్నాను ముందుకు నడుస్తూ.

వారి సంభాషణ విన్నానని గ్రహించిన ఆడవాళ్ళు ముగ్గురూ గతుక్కుమని కిక్కురుమనకుండా అనుసరించసాగారు.

కాచిగూడ స్టేషన్లో మమ్మల్ని అప్పారావే రిసీవు చేసుకున్నాడు. మమ్మల్ని స్పాట్ చేర్చి ప్రొవిజన్స్ లిస్టు తీసుకొని గంటకంతా సరుకుల్తో వూడిపడ్డాడు.

ఈలోగా మేము కాలకృత్యాలు ముగించాము. గాడి పొయ్యిలు వెలిగించాము. లక్ష్మి సరోజినీ పద్మాక్షి గబ గబా బియ్యమూ కందిపప్పూ మినపప్పూ శుభ్రం చేశారు.

జిడ్డుగాడు నీళ్ళు తెస్తున్నాడు.

ఈలోగా అప్పారావు తెచ్చిన బ్రెడ్‌ని నేను పీసెస్‌గా కట్ చేశాను, వాళ్ళు ఏర్పాటుచేసిన రెండు రుబ్బురోళ్ళనీ తృప్తిగా చూస్తూ.

మూడువుగంట గడిచింది.

ముందు జాంగ్రీ తయారు కావాలి. విజిటబుల్ బిరియాని ఒకరిద్దరు చెయ్యగలరు.

అందరికీ డ్యూటీలు ఫిక్స్ చేశాను.

లక్ష్మి మినపప్పు రుబ్బుతుంది. పప్పు మెదిగేంతవరకూ ఆమె రుబ్బి ఆ ముద్దని సరోజిని పరం చేసి మళ్ళీ మినపప్పు వేసుకుంటుంది. సరోజిని ఆ ముద్దని మెత్తగా — అతి మెత్తగా రుబ్బుతుంది. ఈలోగా లక్ష్మి 'రఫ్'గా రుబ్బటం పూర్తిచేస్తుంది. నేను సరోజినినుండి కొద్ది కొద్దిగా పిండితీసుకుని జాంగ్రీ బట్టలో వేసి పిండుతాను. వాటినితీసి చక్కెర పాకంలో వేస్తాను. జిడ్డుగాడు వాటిని అందులో ఇరవై క్షణాలపాటు డిప్ చేసి వేరేగా పేరుస్తాడు.

పద్మాక్షి స్పేర్. మా ముగ్గురిలో ఎవరికి మా బాధ్యత పట్ల బోర్ కొట్టినా వాళ్ళని స్పేర్ చేస్తూ ఆ బాధ్యత కండక్టు చేస్తుంది.

"లక్ష్మి! మినప్పప్పుతో బాటు బియ్యం వేసుకోవటం మర్చిపోకు. సరోజినీ! కలర్ సరిగ్గా వేసుకో...." అని యథాలాపంగా హెచ్చరించి పాకంకోసం చక్కెర కొలుస్తూ పాత్రలో పోయనారంభించాను.

4

అయిదున్నరకల్లా అందమైన—ఒకేరకం సైజుల్లో—లేత గులాబీ రంగులో—అచ్చే—తినబుద్ధి కావటంలేదు—ముద్దు పెట్టుకుంటూ వుండిపోదాం అనిపించేలా వున్న నెయ్యి జాంగ్రీ పీసులూ ఘుమఘుమలాడే విజిటబుల్ పులావూ తయారై పోయింది. అప్పారావుకి అన్నీ అప్పగించాను.

"మీరూ వుండండి. మరో గంటలో ఫంక్షన్ మొదలవుతుంది. చూసినట్టూ వుంటుంది. సర్వ్ చేసినట్టూ...."

"సారీ — సర్వ్ చెయ్యటం మా బాధ్యతకాదు. యిక్కడే కాదు, మేం ఎక్కడా సర్వ్ చేయటానికొప్పుకోం...." అని నవ్వుతూనే తిరస్కరించి మొహం ముడుచుకొని వెళ్ళిపోతోన్న అప్పారావుని చూసి జాలిగా నిట్టూర్చాను.

గబగబా అందరం స్నానాలు కానిచ్చాం.

అది సినిమా టాకీసులున్న ఊరైతే—ఆ టయానికి మా విధులై పోతే—ఆ ముగ్గురో ఎవరో ఒకర్ని తీసుకొని సిన్మాకి చెక్కెయ్యటం నా అలవాటు. మిగతావాళ్ళకి తోడుగా జిడ్డుగాడుంటాడు.

"అగ్ని సమాధి ఆడుతోంది. ఎవరొస్తారు?" అన్నాను.

పద్మాక్షి తప్ప మిగిలిన ముగ్గురూ అలసిపోయామనీ రెస్టు తీసుకుంటామనీ అన్నారు.

పద్మాక్షిని తీసుకొని బైటికి నడిచాను.

ఇంటర్వెల్లో పద్మాక్షితో బ్రూ కాఫీ తాగుతోన్న నేను కిటికీలోంచి జిడ్డుగాడు నన్ను రమ్మని సైగ చేస్తోండటం చూసి ఆశ్చర్యపోయాను.

ఎందుకొచ్చాడు జిడ్డుగాడు? నాకు తెలీకుండా సిన్మా

కొని నాకంట ఎందుకు పడతాడు? వేళ ఆఫరేదైనా వచ్చి—నన్ను అర్జంటుగా పిలవడానికొచ్చాడా? పారిపోయిన సరోజిని మొగుడు వచ్చి అల్లరి పెడుతున్నాడా?

పద్మాక్షి నక్కడే వుండమని గేటు తోంచి అవతలికి వెళ్ళాను.

"ఏరా వెధవా! కొత్త చోట యిద్దరాడవాళ్ళని ఒంటరిగా వదిలివస్తావా! బుద్ధి లేదూ!" కసిరాను.

"బావా!....బావా....!!" అంతకుమించి మాట్లాడలేక పోతున్నాడు వాడు.

అప్పుడు గమనించాను. వాడి శరీరంలో సన్నని కంపన. మనిషి బాగా భయపడుతున్నాడు. శరీరమంతా చెమట్లు పట్టేశాయి, బయట చల్లగా గాలి వీస్తోన్నా.

"ఏమిటది? ఎందుకలా భయపడుతున్నావు? ఏం జరిగిందిరా?" వీపు తడుతూ మృదువుగా ప్రశ్నించాను.

వాడు చెప్పిన మాటలు విన్న నాకు నోట మాట రాలేదు.

5

మేం వెళ్ళేసరికి అక్కడ పరిస్థితి అంతా గందరగోళంగా వుంది. అక్కడున్న వాళ్ళందరూ ఆగ్రహావేశాలతో కంపించిపోతూ మాకోసం యెదురు చూస్తున్నారు.

మమ్మల్ని చూడగానే మా మీదికి వచ్చారు దేహశుద్ధి చెయ్యటానికి.

సరోజినీ లక్ష్మి తలలు వంచుకొని అవమానం పొందిన వాళ్ళలా మొహాల్ని కందగడ్డల్లా చేసుకొని వున్నారు.

పోలీసులు మొదటగా పరిస్థితిని అదుపులోని తెచ్చారు.

ఆ తర్వాత ఎస్సై నా దగ్గరికొచ్చాడు.

"కొత్త జంటని హత్య చెయ్య ప్రయత్నించిన నేరానికి నిన్ను అరెస్టు చేస్తున్నాను" అన్నాడు నావైపు క్రోధంగా చూస్తూ.

తల కొట్టేసినట్టయింది. ఎనిమిదేళ్ళబట్టీ నా వృత్తి ధర్మాన్ని నేను సక్రమంగా నిర్వర్తిస్తున్నాను. పాక శాస్త్ర ప్రజ్ఞాధురీణ, నలభీమాంశ సంభూతుడు వగైరా బిరుదులేవీ పొందకపోయినా నాకెప్పుడూ యెక్కడా ఎలాంటి చెడ్డ పేరూ రాలేదు. అలాంటిది.... అలాంటిది...

అప్పారావు సుడిగాలిలా నా ముందుకొచ్చాడు.

"గతంలో నీ వంటకం రుచిచూసి అద్భుతంగా వుంటుందని నిన్ను బుక్ చేసుకున్నాం. అంతేకాని గతిలేక్కాదు. ఈ మహానగరం వంటవాడికి మొహం వాచి కాదు.

"నువ్వడిగినంత ఒప్పుకున్నాం. నీకు ఎలాంటి లోటూ రాకుండా సక్రమంగా ఏర్పాట్లు అన్నీ సమకూర్చాం.

"ఈ సందడిని యిలా అభాసుపాలు చెయ్యాలనే దుర్బుద్ధి నీ కెందుకు పుట్టింది? నీ కపకారం చేసిందెవరు? పెళ్ళికూతురా పెళ్ళికొడుకా? లేక యిద్దరూనా? ఒకవేళ చేసినంత మాత్రాన నీది అంత కసాయి గుండెవా? తియ్యని, కమ్మని రుచుల్లో పాటిలేని వంటకాల్ని అందించే నీ చెయ్యి యింతటి ఘాతుకానికెలా పాల్పడింది?"

ఏ ఒక్కటీ నాకర్థం కావటంలేదు. ఒక్క ప్రశ్నకూ నా దగ్గర సమాధానంలేదు. ఎక్కడో ఏదో లోపం జరిగింది.

ఎక్కడ జరిగింది?

ఎందుకు జరిగింది??

కొత్త జంటకోసం నువ్వు ప్రత్యేకంగా వేసిన స్వీట్లు కంచం పైజు జాంగ్రీల్లో విషం కలిసింది. దాన్ని ప్రేమగా అబ్బాయి అమ్మాయికీ అమ్మాయి అబ్బాయికీ తినిపించారు. అయిదు నిమిషాలతర్వాత ముందుగా అనిత పడిపోయింది. ఆ తర్వాత శరత్ బాబు పడిపోయాడు. యిద్దర్నీ ఆస్పత్రిలో చేర్చారు. అనిత పరిస్థితి ప్రమాదకరంగా వుంది. వాళ్ళు తిన్న స్వీటుని పరీక్షించిన డాక్టరు అందులో విషం కల్సిందని చెబుతున్నాడు. దీనికి నువ్వు కోర్టులో సమాధానం చెప్పవలసి వుంటుంది" కర్కశంగా అన్నాడు ఎస్సై.

నా తల్లి మరణించినప్పుడు ఏడవలేదు నేను. తండ్రి మరణించినప్పుడు — పెళ్ళివాళ్ళకి మా కారణంగా నష్టం కల్గిందని కన్నీళ్ళు పెట్టుకున్నాను. చెల్లెలు ఎవడితోనో లేచిపోయిందని తెల్సినప్పుడు కన్నీళ్ళొచ్చినా అవి వుల్లిపాయ తరిగినప్పుడొచ్చిన కన్నీళ్ళుగా సర్దుకుపోయాను.

కాని.... కాని.... యిప్పుడు కన్నీళ్ళొస్తున్నాయి. ఆగకుండా వస్తున్నాయి. ఇది నా వ్యక్తిత్వానికీ నా వృత్తిధర్మానికీ గొడ్డలిపెట్టు. తీరని కళంకం. ఘోరమైన అవమానం.

యికపై నాకు అఫర్లు ఎలా వస్తాయి? కొత్తగా పెళ్ళాడిన యువజంటను హత్యచెయ్యటానికి ప్రయత్నించిన దుర్మార్గుడుగా నా పేరు సమాజంలో శాశ్వతమైపోతుంది. అందరూ నన్ను హేయంగా చూస్తారు. అవమానకరంగా మాట్లాడతారు. చులకనగా నిర్లక్ష్యం చేస్తారు.

“ఇన్‌స్పెక్టర్ గారూ! నలుగురికీ వండిపెట్టి పొట్ట

పోసుకునే వృత్తి నాది. నేనూ అంతో యింతో చదువుకున్నాను. మరీ మొరటువాణ్ని కాను. స్కూలు ఫైనలుతో ఉద్యోగ సంప్రదాన్ని ఈదలేనని కులవృత్తికి వారసుణ్ణయ్యాను.

"అలాంటి నేను — నేను చేసిన పదార్థాల్లో నేనే విషం కలిపి నా తలకు నేనే కొరివి పెట్టుకుంటానా? అందువల్ల నాకు మచ్చ వస్తుందని తెలియని మూర్ఖుణ్ణా? ఆ అనిత ఎవరో—ఆ శరత్ బాబు ఎవరో నాకు తెలీనే తెలీదు. వాళ్ళ మొహమైనా చూళ్లేదు నేను.

"నేను మొహమైనా చూడనివాళ్ళు నాకేం ద్రోహం చేశారని నేనంత ఘోరం తలపెడతాను? సార్! నేను అయిటమ్స్ ప్రిపేర్ చేసి వీళ్ళకే అప్పగించాను...."

"అంటే—మేమే కలిపామంటావా విషం?" అప్పారావు మీదపడి కొట్టబోయాడు.

"అప్పారావుగారూ! దయచేసి అపార్థం చేసుకోకండి. నేను మీలో ఏ ఒక్కర్ని వుద్దేశించి అనటంలేదు" అన్నాను నిర్వికారంగా అతన్ని చూస్తూ.

నా మాటల్లో కొంత నిజమూ సంస్కారమూ కనిపించాయేమో ఎస్సైకి, కాస్త శాంతించాడు.

"చూడు మిష్టర్! మీ ట్రూపుకి నువ్వే యజమానివి. అంచేత నిన్ను అనుమానంమీద అరెస్టుచేస్తున్నాను. నీకు బెయిలు యివ్వటానికి ఎవరైనా ముందుకొస్తే విడిచిపెట్టడానికి నాకే అభ్యంతరమూ లేదు...." అన్నాడు ఎస్సై నన్ను జీపెక్కవలసిందిగా ఆదేశిస్తూ.

నా వెనక నా వాళ్ళు కంట తడిపెట్టడం చూసిన నా కళ్ళకి మరిన్ని నీళ్ళొచ్చాయి.

6

"వీరి పేరు శ్రీ జలంధర్. ప్రఖ్యాత డిటెక్టివ్. పరిచయం లేకపోయినా నిన్ను బెయిలుపై విడుదల చెయ్యటానికి ముందుకొచ్చారు" అంటూ ఓ ఆజాను బాహుడైన యువకుణ్ని పరిచయం చేసింది పద్మాక్షి.

రెండు చేతులూ జోడించి నమస్కరించాను. నా మొహంలోంచి కోటి కృతజ్ఞతా కాంతులు ఆయనవైపు ప్రసరించసాగాయి.

"నువ్వు కృతజ్ఞతలు చెప్పవలసింది నాక్కాదు. ఈ అమ్మాయికి" అన్నాడు జలంధర్, పద్మాక్షిని చూపిస్తూ.

పద్మాక్షి అతి కష్టంమీద డిటెక్టివ్ జలంధర్ అడ్రసు కనుక్కోగలిగింది. నేను నిర్దోషిననీ—ఈ కొత్త చోట నాకు జామీనిచ్చే నాథుడెవడూ లేడనీ ఈ ఆపదనుండి ఆయనే గట్టెక్కించాలనీ అందుకు ఫీజుగా జీవితాంతం ఆయనకి ఉచితంగా వూడిగం చేస్తాననీ కన్నీళ్ళతో ఆయన పాదాలు పట్టుకొని వేడుకుందిట. ఆయన మనసు కరగి వచ్చారు.

ఆమె ఎవరు? నేనెవరు? వరదల్లో ఖమ్మంలో వున్నదంతా పోగొట్టుకొని పొట్ట చేతబట్టుకొచ్చి ఒక దేవాలయంలో సంతర్పణ రోజున ఆకలికడుపుతో దేవళం ముంగిట నిలబడి — అందరిచేత ఛీత్కారాలు తింటూ జాలిగా దిక్కులుచూస్తూ నా కంటబడి—నా ఆశ్రయంలోకొచ్చి—తన సర్వస్వాన్నీ సమర్పించి—యిప్పుడు నా కష్టాల్లో కూడా—....

పద్మాక్షి స్నేహితురాల్నీ ప్రియురాల్నీ భార్యనీ దేవతనీ మించి ఎదిగిపోయింది నా దృష్టిలో.

7

రెడ్ విల్స్ వెల్లించుకొని చెప్పమన్నట్టుగా నా వైపు చూశాడు జలంధర్.

నా గురించిన వివరాలన్నీ ఆయనకి విన్నవించాను. పద్మాక్షి, సరోజిని, లక్ష్మి — ఈ ముగ్గురితో నాకున్న సంబంధానుబంధాల విషయంకూడా నేను దాచలేదు.

"నువ్వు పద్మాక్షిని సినిమాకు పిల్చుకుపోయానన్నావు. తమని పిల్చుకుపోలేదన్న అసూయతో మిగిలిన ఇద్దరూ..."

"లేన్సార్! క్రితంసారి రిటైర్డు డి. సి. టి. వో. గారి మనమరాలి వివాహానికి ఒప్పుకొని వచ్చాము. అప్పుడు సరోజిన్ని తీసుకొని వెళ్ళాను. అంతకుముందు ఓ. ఫంక్షనుకి ఒప్పుకొని కర్నూలు వెళ్ళాము. అప్పుడు లక్ష్మిని తీసు కెళ్ళాను. అప్పుడు మిగత వాళ్ళెవరూ యిలా ప్రవర్తించ లేదు. అయినా నాకు నష్టంకల్గితే అందులో వాళ్ళకీ భాగం వుంటుందిగా...."

"యింకో అబ్బాయి వున్నాడన్నావు...."

"ఆc. జడుగాడు...."

"జిడ్డుగాడా! అదేం పేరు?"

"వాడికి సినిమా పిచ్చి డబ్బు పిచ్చి ఎక్కువ సార్! సినిమాకెళ్ళానని డబ్బులడుగుతాడు. తర్వాత ఇంటర్వెల్ లో కాఫీకోసం డబ్బులిమ్మంటాడు. వస్తూ వస్తూ చాక్లెట్ తెస్తాను డబ్బులిమ్మంటాడు. అంచేత ముద్దుగా అలా పిలుస్తుంటాను. అసలు పేరు కేశవులు...."

"వాడిపై మీకేమైనా అనుమానం వుందా?"

"నో ...వాడు నా కుడిభుజం."

"వృత్తిరీత్యా మీకున్న శత్రువులు...."

"ఈ కేసులో నే తలదూరస్తారనుకోవటం బావుండదు. గత ఎనిమిదేళ్ళుగా ఏమీ చెయ్యనివాళ్ళు...."

"ఈర్ష్యాసూయలు మనిషి మనసులో ఎప్పుడు ప్రవేశిస్తాయో ఎవరు చెప్పగలరు?"

తల అడ్డంగా వూపాను. "వుహూఁ .... వాళ్ళను తీసెయ్యండి సార్ లిస్టులోంచి...."

"అలాంటప్పుడు సరోజిని భర్తకేమైనా అవకాశం వుందా?"

"లేదు. అంతదూరం ఆలోచించగల మనిష్కం కాదు వాడిది. అయినా వంటకాల్లో విషం కలిపే అవకాశం అతనికెలా వస్తుంది?"

యింతలో ఫోను మోగింది.

"హలో....డిటెక్టివ్ జలంధర్ స్పీకింగ్ ...."

"నేను చక్రవర్తిని మాట్లాడుతున్నాను. ఏమంటున్నాడు మీ పాకశ్రీ!?"

అవతలి మాటలు నాకు స్పష్టంగా వినిపించాయి. దానికి జలంధర్ బదులివ్వలేదు. "ఏమిటి విషయం?" అన్నారు.

"అనితకు స్పృహొచ్చింది. ఫర్వాలేదంటున్నారు డాక్టర్లు.!"

"థాంక్ గాడ్!!" జలంధర్‌తో పాటు నేనూ నిట్టూర్చాను.

"హాస్పిటల్ నుండే మాట్లాడుతున్నావా?"

"అవును."

"వుండు అక్కడే. పావుగంటలో వస్తున్నాను" రిసీవర్ క్రెడిల్ చేశారు జలంధర్.

8

"సునీతా!!!" గట్టిగా కేక పెట్టాను.

అదిరిపడ్డాడు జలంధర్.

"అవున్సార్! ఈమె నా చెల్లెలు సునీత. నెలక్రితం లేచి.... సారీ.... నెలక్రితం తను ప్రేమించిన యువకుడితో లేచిపోయింది. అప్పట్నుండీ ఆమెను తల్చుకోని క్షణం లేదు. లేచిపోయినందుకు కోపగించుకున్నా తన ప్రేమ విషయం నాకు చెప్పివుంటే నేను ఆనందంగా ఆ పెళ్ళి కంగీకారం తెలిపి వుండేవాడిని.

"సార్! ఈ సంఘటనలో నేను నిర్దోషిగా నిరూపించబడతానని బలమైన నమ్మకం దృఢపడుతోంది—" ఆనందంగా అని — అంతలోనే కళ్ళు ఎరుపెక్కగా, "సార్! నా చెల్లెల్ని హత్య చెయ్యాలని చూసిన ఆ కిరాతకుదెవడో, వాణ్ని ... వాణ్ని ...." కసిగా పళ్ళు కొరుకుతూ అన్నాను.

చిరునవ్వుతో సమాధాన సూచకంగా మొదట నా భుజం తట్టి. "పకకి పగ సమాధానం కాదు. కాకూడదు రామచంద్రుడూ!" అన్నాడు జలంధర్.

ఈ కేసులో ప్రాణాలకి తెగించైనా సరే — నా చెల్లిపై హత్యా ప్రయత్నం చేసినవాడిని ఉరికంబం ఎక్కించటంలో డిటెక్టివ్ గారికి సహకరించాలనే నిర్ణయానికొచ్చాను.

నా చెల్లిని క్షేమంగా గట్టెక్కించి నాలో కలిపిన దేవుడికి మనసారా దణ్ణం పెట్టాను.

మర్రోజు నా చెల్లెలు అంతా చెప్పింది.

హైద్రాబాదునుండి తరచూ ఓ కుర్రవాడు తన దూరపు బంధువులని చూడటంకోసం మా ఊరు వస్తూండే

వాడు. షట్టు సెంటరువద్ద సునీతతో పరిచయం కలిగింది. ప్రేమగా మారింది. అతను తక్కువ కులంవాడు కావడంతో నేను కోప్పడతానసే భయంచేత సునీత నాతో ఈ విషయం చెప్పలేకపోయింది.

ఫలితంగా ఓ మంచి రోజున వాళ్ళిద్దరూ లేచిపోవడానికి సుముహూర్తం పెట్టుకున్నారు.

నేరుగా బొంబాయి చేర్చాడు. నేను దానికి చేయించిన రెండుపొరల బంగారు గొలుసమ్ముకున్నారు. ఆ తర్వాత అంతా నవలల్లో సినిమాల్లోలా జరిగింది.

పదిహేన్రోజులు బాగా వాడుకొని మూడువేలకి దాన్నో బ్రోకర్ గాడి కమ్మేశాడు. ఓ వ్యభిచార గృహం యజమానురాలు దాన్ని అయిదువేలకి కొనుగోలు చేసింది.

అక్కడ సునీత నరకం అనుభవించింది ఓ పదిరోజులు.

హైద్రాబాదులో నగల వర్తకుడి కుమారుడు శరత్ బాబు కష్టమర్సవద్ద కొనుగోలుచేసిన బంగారంను కూడబెట్టి రెండు మూడు కేజీలు కాగానే బొంబే మార్కెట్లో అమ్మటం అతడి వ్యాపారంలో ఓ భాగం. అలా వచ్చినప్పుడు 'కన్నె సరదాలు' తీర్చుకోవటం అతని హాబీ.

అలా సునీతని చూశాడు. విముక్తికోసం అలమటిస్తోన్న సునీత కన్నీళ్ళు తుడిచాడు. మనసుని బంగారం కన్నా విలువైందిగా విశ్వమంత విశాలమైందిగా మార్చుకొని ఆమెని పదివేలకు కొని—ఐ మీన్—ఆ ఓనర్ కి ఆ చెక్కం యిచ్చి ఆమెనా చెరనుండి విడిపించాడు. అక్కడే ఓ ఆలయంలో ఆమెని పెళ్ళిచేసుకొని ఆశీస్సుల కోసం వచ్చాడు.

తలిదండ్రుల ఆశీస్సులు లభించలేదు. స్వతంత్ర జీవితం కోసం ప్రయత్నిస్తూ తన వాటాగా యాభై లక్షలు

తీసుకొని బయటపడ్డాడు.

క్రొత్తగా ప్రారంభించిన వ్యాపారాన్నీ అతని మేరేజ్ సందర్భాన్నీ పురస్కరించుకొని అతడూ, అతని ఫ్రెండ్స్సూ యిచ్చిన పార్టీ యిది.

యిందులో యింత కల్లంతు జరిగింది.

శరత్ బాబుకి చేతులెత్తి నమస్కరించాను.

అతనూ కండం తప్పించుకున్నాడు.

అతని విశాల హృదయానికీ గొప్పదనాకీ జోహార్లర్పించాను.

యిప్పుడు కథ మరో మలుపు తిరిగింది.

శరత్ బాబు తండ్రి-కొడుకు తనమాట కాదన్నాడని-సునీతపై వైరంతో ఆమెని చంపించాలని ఈ ప్లాన్ వేశాడేమో! అయితే ఆ స్వీటు తన కొడుకూ తినే అవకాశం వుంటుందేమోనన్న ఆలోచన అతనికి వచ్చి వుండదా? నా మాట లక్ష్యపెట్టనివాడు నా కొడుకే కాదనుకొంటాడా? కన్న కొడుకుపై అంత కఠినత్వం ఉంటుందా ఏ తండ్రికైనా?

ఆలోచిస్తూ శరత్ తో మాట్లాడుతోన్న జలంధర్ వద్దకి నడిచాను.

"లేదు. నా తండ్రి కోపగించుకున్నమాట నిజమే. కాని ఆ కక్షతో నన్ను చంపేంత నీచుడు కాడాయన. అలా ప్రయత్నిస్తే నన్ను వెళ్ళగొట్టాడు కాబట్టి నేరం ఆయనపై సులువుగా ఉడుకుతుంది" అన్నాడు శరత్ బాబు.

"మీ వ్యాపారరీత్యా మీకు శత్రువులు ఎవరైనా ఉన్నారా?"

"ఎవరూ లేరు."

"మీ స్నేహితుల్లో?"

"లేరు."

"యింతా ఎవరిపైనైనా మీకనుమానం వుందా?"

"సార్ ...." నేనందుకున్నాను. "సునీత చిక్కిన బ్రోతల్ హవుస్ ...."

జలంధర్ తల అడ్డంగా వూపారు. "అయిదు వేలు పోసి కొంటే పదివేలు దక్కాయి. దాంతో తృప్తిపడక బాంబే టు హైద్రాబాద్ ప్రయాణించి పగతీర్చుకునే మన స్తత్వం కలవాళ్లు వుండరు...."

నోర్మూసుకున్నా నేను.

హత్యా ప్రయత్నం చేసిన వాడెవడన్న ప్రశ్న ఆ రోజుకి ప్రశ్నగానే వుండిపోయింది.

9

పక్కమీద పడుకున్నానేగాని నిద్ర రావటంలేదు.

నా చెల్లెలు నాకు దక్కింది. ఈ వార్త విన్న సరోజిని లక్ష్మి పద్మాక్షి జడ్డుగాడికీ కలిగిన ఆనందాన్ని పట్టలేక వాళ్ళు యిల్లంతా హడావుడిలాంటిది చేశారు.

వాళ్ళకే అలా వుంటే నాకెలా వుండాలి?

నా చెల్లెల్ని యికపై కంటికి రెప్పగా కాపాడుకోవాలి. ఆమెపై హత్యాప్రయత్నం జరిగింది. దుండగులెవరో తెలిసి శిక్షకు పాత్రులయ్యేవరకూ ఆమె మృత్యుద్వారంలో నిలబడి వున్నట్టే లెక్క.

అయినా ప్రత్యేకమైన గదిలో అమర్చిన జాంగ్రీపై ఎవరు వచ్చి విషం చల్లుతారు? ఎవరు రానిచ్చారు?

కొంపదీసి అప్పారావుగాని అప్పారావు స్నేహితులు గానీ అనుచరులుగానీ....

అప్పారావో అతని మనుషులో అయితే వారికి సునీత ఛ—ఆ నరకకూపంనుండి తప్పించాక ఆమెకి శరత్ పెట్టిన కొత్త పేరు అనిత కదూ—అయితే వారికి అనితపై పగ వుండదు. శరత్ పైనే అయివుండాలి.

సన్నిహితులుగా ప్రవర్తిస్తూ యింత దారుణాని కొడిగడతారా!? ఏమో!

స్వీట్ రూమ్లో — అయ్ మీన్ స్వీట్ వుంచిన రూములో వ్రేలి ముద్రలేవైనా దొరుకుతాయేమో— ఉదయాన్నే డిటెక్టివ్ గార్ని కలిసి అడగాలి.

అయినా ఆ రూమ్లో ఎందరో తిరిగారు.

ఎలా అనుమానించడం?

....ఆలోచిస్తూ అప్రయత్నంగా యిటువేపుకి తిరిగిన నేను ఒక్క క్షణం చకితుడయ్యాను. చిన్న చప్పుడు వినవచ్చింది. దాన్నిబట్టి ఊహిస్తే నా ప్రక్కన కాస్త దూరంలో పడుకొని వున్న జిడ్డుగాడు లేవబోయి—సగం లేచి—నేను కదలగానే ఛటుక్కున పడుకోగా వచ్చిన శబ్దంలా స్ఫురించింది.

ఎందుకు? ఎందుకు వాడలా చేశాడు? యింతవరకూ ఎందుకు మేలుకొని వున్నాడింకా? తను కదలకుండా వుండివుంటే ఏం చేసేవాడు? కొంపదీసి వాడికీ ఈ హత్యాప్రయత్నానికీ ఏదైనా సంబంధం వుందా?

ఛ—ఎందుకుంటుంది?

ఎందుకైనా మంచిదని కళ్ళు మూసుకొని బద్ధకంగా ఆవులించి దొంగనిద్ర నటిస్తూ గట్టిగా గురక పెడుతూ ఓరకంట వాణ్ణే గమనించసాగాను.

అయిదు నిమిషాలు నిశ్శబ్దం—నా చేతి గడియారపు టిక్ టిక్లు ప్రక్కవాడిక్కూడ స్పష్టంగా విన్పించేంతటి

భయంకర నిశ్శబ్దంలో ముందుకు నడిచాయి.

నెమ్మదిగా నాకేసి తిరిగాడు జిడ్డుగాడు తల ఎత్తి, నా కళ్ళకేసి చూశాడనుకుంటాను.... నెమ్మదిగా లేచాడు. వాడు వెళ్తోన్న చప్పుడు అప్పుడు వినిపించసాగింది నాకు. నెమ్మదిగా తలుపు తెరిచాడు.... చూశాడు.

ఒక్క నిమిషం ఆగాను. వాడు రాలేదు. ఏమీ అర్థంకాని అయోమయస్థితి. తెలియని ఎగ్జయిట్ మెంట్. వాడికి దీంతో సంబంధముందని గట్టిగా అరుస్తోన్న మనసును బుజ్జగించలేక కొట్టలేక రాజీపడలేక— నేనూ లేచాను. తలుపుదాకా వెళ్ళి బయటికి తొంగి చూశాను.

అప్పటికే ఫర్లాంగు దూరం దాటిన జిడ్డుగాడు— రోడ్డుమీద అమితవేగంతో పరిగెడుతున్నాడు ముందుకు!!

10

"....నేనూ వెంబడించాలనుకున్నాను. కాని నా వేగంతో వాణ్ని అందుకోలేనన్పించింది. అందుకే ఆగి పోయాను...." దీర్ఘంగా నిట్టూర్చాను.

సాలోచనగా తల పంకించాడు జలంధర్.

"కాని..జిడ్డుగాడు అనుమానితుడంటే నేను ఇప్పటికీ నమ్మలేక పోతున్నాన్సార్...." అన్నాను బాధగా.

"మీరు స్వీట్లు ప్రిపేర్ చేస్తున్నప్పుడు వాడేం చేస్తున్నాడు?"

"డాల్డాతో నేను కాల్చిన జాంగ్రీలను చక్కెర పాకంలో డిప్ చేస్తున్నాడు."

"అంతకుముందు?....మొదట్నుండీ చెప్పండి...." అన్నారాయన దీర్ఘంగా ఆలోచిస్తూ.

"మినప్పప్పు నానబెట్టాము. అంతవరకూ నీళ్ళు తెస్తూ

పొటాటోసూ బ్రింజాల్సూ కట్ చేస్తూ వున్నాడు. విజిటబుల్ పులావ్ మసాలా పౌడర్ని తయారుచేశాడు. ఈలోగా పప్పు నానింది. మొదటిదశ మెత్తబడేవరకూ అత్తమ్మ రుబ్బి సరోజినికిచ్చింది. సరోజిని అప్పుడు రంగు కలిపి రెండవ దశ మెత్తబడేవరకూ రుబ్బాలి.

"సరోజిని రంగుపొట్లంకోసం వెతికింది. నేనప్పుడు పాకాన్ని కలియబెడుతూండటంతో సరుకుల్లో పొట్లం వుందేమో చూడమన్నాను. చూశాడు. లేదు. నిజంగా నే లేదు.

"అప్పారావుని పిల్చి అడిగాను. సరుకుల్లో వుందనీ బహుశా దార్లో పడిపోయి వుండొచ్చనీ మళ్ళీ తెప్పిస్తాననీ అన్నాడు. సమయానికి డ్రైవరూ లేరనీ బిడ్డుగాణ్ణే పంపించమనీ రిక్వెస్టుచేసి పదిరూపాయలనోటు నాకందించాడు. జాంగ్రీ కలర్ తులం రెండురూపాయలు. అయిదు తులాలు పట్రమ్మని చెప్పాను. అలాగేనని వెళ్ళి తెచ్చాడు."

"ఆ తర్వాత వాడు ఎక్కడికీ వెళ్ళలేదా?"

తల అడ్డంగా వూపాను.

"జరగాల్సిందేదో అప్పుడే జరిగింది."

"నాకేం అర్థంకావటంలేదు" అన్నాను.

జవాబివ్వలేదు జలంధర్. సిగరెట్టు కాలుస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూ అయిదు నిమిషాలపాటు మౌనంగా వుండిపోయారు.

11

"జాంగ్రీకలర్ వుందా?" అడిగాను.

లేదన్నాడు షాపువాడు.

ముందుకు సాగాను.... జలంధర్ ఆదేశం ప్రకారం

మేము స్వీట్ ప్రిపేర్ చేసిన యింటినుండి బయల్దేరి వరసగా షాపుల్లో యిలా అడుగుతూ పోతున్నాను.

ఆరో షాపులో దొరికింది. ఒక తులం కట్టి యిమ్మన్నాను. పొట్లం తాలూకు కాగితం చూశాను. బైబిలు క్రొత్త నిబంధన గ్రంథం తాలూకు పేపరది.

కరక్టే. నిన్న వాడు తెచ్చిందీ యిలాంటి పేపర్లో నే!

ఓ ప్యాక్ క్యాప్స్టన్ సిగరెట్లూ అగ్గిపెట్టే కొనుక్కొని షాపువాణ్ని చూస్తూ "చూడు...." అన్నాను.

చూశాడు.

"నిన్న ఉదయం తొమ్మిదిన్నర ప్రాంతంలో ఓ కుర్రాడు అయిదు తులాల జాంగ్రీ కలర్ తీసికెళ్ళాడు. గుర్తుందా?" అడిగాను.

"ఎక్కడా! నేనప్పుడు యింట్లో వంటచేస్తున్నాను. కొట్లో మా యాడది వుండింది. ఒసే కస్తూరీ! యిట్టా రాయే...." గట్టిగా కేక పెట్టాడు నలభైయేళ్ళ శెట్టి

వచ్చింది పాతికేళ్ళ పడుచు.

ఆమెనీ అదే ప్రశ్న అడిగాడు.

అవునన్నట్టు తలూపింది.

"చూడమ్మా! ఆ సమయంలో గిరాకీ యెక్కువగా వుండిందా?" అడిగాను సిగరెట్ వెలిగిస్తూ.

తల అడ్డంగా వూపిందామె.

'కొంపదీసి ఈ మహాతల్లికి మాటలు రావా?' అనుకొని "ఆ కుర్రాడు తిరిగి వెళ్ళిపోయేటప్పుడుగాని, పౌడర్ కొంటున్నప్పుడుగాని...."

"అతడు పౌడరు కొనలేదయ్యా! జాంగ్రీ కలర్ కొన్నాడు" అందామె.

'అమ్మయ్య' అనుకొని—"అదేనమ్మా! కలర్ కొన

టానికొచ్చి కొని — వెళ్ళిపోయేలోగా ఎవరేనా వాణ్ణి కలిశారేమో గుర్తుకి తెచ్చుకొని చెప్పగలవా?"

ఓ. నిమిషంపాటు గుర్తుకి తెచ్చుకుందామె.

"అవును. కొట్లో సిగరెట్ కొన్న ఓ ఆసామీ ఎవరి కోసమని అడిగాడు. పెళ్ళికోసమని ఆ కుర్రాడు చెప్పాడు. ఆ కుర్రాడి పేరడిగాడు. గుడ్డుగాడని చెప్పి-"

"కాదు. జిడ్డుగాడు."

"ఆఁ.... జిడ్డుగాడని చెప్పి నాలిక్కర్చుకొని-కేశవులు అని అన్నాడు. ఆ శాల్తీ సిగరెట్ కాలుస్తావా అనడిగితే మరో పదేళ్ళదాకా దీపావళికి పటాసులు కాలుస్తాననీ అందాకా చాక్లేట్లు తింటాననీ అన్నాడు. అతడు గుప్పెడు చాక్లేట్లు కొన్నాడు. యిద్దరూ కల్సి ముందుకుపోయారు. యింతలో యింట్లో పోపు మాడిన వాసన వచ్చింది. మా ఆయన నిదరోతున్నాడేమోనని కేకేస్తూ లోపలకెళ్ళాను. తర్వాత చూడలేదు" అందామె.

'బంగారు తల్లే' అనుకొని "ఆయన మీకు బాగా తెలుసా?" అనడిగాను.

"బాగుంది సంబడం! వాడెవడైతే నాకేం? మా ఆయనకు తెలుసేమో అడుగు" అని మూతి మూడు వంకర్లు తిప్పి లోపలకి వెళ్ళింది కస్తూరి.

"ఏందయ్యోవ్ కత? ఏదో పాపమని పిలిపిస్తే తిక్క తిక్క ప్రశ్నలేస్తా వున్నావ్? వాడెవడో దానికెందుకు తెలియాల?" గయ్యిమన్నాడు శెట్టి.

"అయ్యా! మహానుభావా! నేనడిగిందది కాదు. అతను మీ కొట్టుకి అప్పుడప్పుడూ ఏదైనా కొనడంకోసం వస్తూంటాడా?" అనడిగాను చేతులు జోడిస్తూ.

"బోడి మూడ్రూపాయల బేరంజేసి ఆ దేవడో

'బ్రూక్ బాండ్'లా పెళ్ళేత్తా ఉన్నావే! నడునడు.."
అని కసిరాడు శెట్టి.

నుదురు కొట్టుకున్నాను. 'అబ్బా! ఈ మాత్రందానికే తలనెప్పి వచ్చేసింది. డిటెక్టివ్‌లు ఎలా కూపీలు లాగుతూంటారో కదా!' అనుకుంటూ అక్కడికి నాలుగడుగుల యివతలున్న కిళ్ళీకొట్టువద్దకి నడిచాను.

కిళ్ళీకొట్టు కుర్రాడు యిందాక శెట్టి భార్య వచ్చినప్పుడు మెరిసే కళ్ళతో చూడటం ఓరగా గమనించాను. నిన్న జిడ్డుగాడు వచ్చినప్పుడు ఆమే ఉండింది కొట్టులో. అంటే — ఈ కుర్రాడు గమనించే వుండాలి.

నా ప్రయత్నం ఫలించింది. ఆ శాల్తీని వాడు చూశాడు. గోధుమ రంగు కోటు. నల్లని మీసాలు. ఫ్రెంచ్ కటింగ్. పాదాలకు నల్లని నిగనిగలాడే బూట్లు.

అతను యింతకుముందు బృందావన్ బార్‌కి తరచూ వస్తూండేవాడట. ఈ కుర్రాడు యిక్కడ కిళ్ళీకొట్టు పెట్టకముందు ఆ బృందావన్ బార్ ప్రక్కన కిళ్ళీకొట్టు నడిపాడట. అంతేకాదు. వాడు మరో విషయమూ చెప్పాడు!

మై గాడ్! పులిహోర తిన్న చేతికి వాసన కొట్టినట్టు జలంధర్‌తో తిరిగిన ఆ కొద్దిపాటి భాగ్యానికి పరిశోధన చేసి ఓ క్లూ పట్టుకున్నాను.

ఈ బోర్డు తీసేసి ఆ బోర్డు పెట్టుకుంటే —?

'మై గాడ్!!' మరో భంగిమలో అనుకున్నాను.

12

నేను వెళ్ళిన పది నిమిషాలకి డిటెక్టివ్ జలంధర్ వచ్చారు.

గభగభా నేను సేకరించిన సమాచారం గుమ్మరించి,

"అంతే కాస్పార్! ఈ తెల్లార్జామున జిడ్డుగాడు నా గదిలోంచి దొంగతనంగా పరిగెత్తి వెళ్ళింది శెట్టి షాపుకి. అప్పటికింకా కొట్టు తెరవలేదు. చాలాసేపు యెదురు చూశాడుట. ఆరుకల్లా కిళ్ళీకొట్టు కుర్రాడు తెర్చాడు. జిడ్డుగాణ్ని గుర్తించి పలకరించాడట. షాపు ఎన్నింటికి తెరుస్తారని అడిగితే తొమ్మిదవుతుందని చెప్పాడు. చాక్లెట్లు కొనిచ్చిన వాడి వివరాలు అడిగాడుట. నాకు చెప్పిందే—అదే—బృందావన్ బార్‌కి వాడు తరచూ వెళ్ళే విషయం చెప్పాడుట. అంతే, ఆగకుండా పరిగెత్తాడట."

"ఇప్పుడర్థమైంది" అన్నారు జలంధర్.

"ఏమిటి?"

"చాక్లెట్లతో మచ్చిక చేసుకున్నాడు, జిడ్డుగాణ్ని. విషం వాడికే యిచ్చి పెద్దసైజు జాంగ్రీల్లో మాత్రం కలుపమని చెప్పివుంటాడు."

"కాని జిడ్డుగాడు నాకు ద్రోహం చేస్తాడా? వృత్తి ద్రోహం తలపెడతాడా?"

"వాడికి చెప్పే రీతిలో చెప్పి వుంటాడు."

ఫోను గణగణమంది. "హలో" అన్నాడు జలంధర్. పదిక్షణాలు అతని ముఖ భంగిమల్లో అనేక మార్పులొచ్చాయి. అవతలి మాటలు అస్పష్టంగా వినపడటంతో అర్థం కాలేదు.

రిసీవర్ విసురుగా క్రెడిల్ చేసి నాకేసి జాలిగా చూశారు.

"హత్య!"

"హత్య జరిగిందా?"

"హత్యచేశారు జిడ్డుగాణ్ని. పద...."

"మై....మై....గాడ్....!!"

డాడ్జికారు శరవేగంతో షాపూర్ నగర్ వేపు ప్రయాణించింది.

చల్లగాలి రివ్వున వీస్తోంది, మధ్యాహ్న సమయమైనా.

జలంధర్ మొహం సీరియస్‌గా వుంది. పెదవులమధ్య రెడ్ విల్స్ ఎర్రగా కాలుతోంది.

పాపం! జిడ్డుగాడు....!

బ్రాందీ బుడ్డి సప్లయ్ చేస్తే—వాళ్ళకి తన పెళ్ళాన్నైనా అప్పగించడానికి సిద్ధపడే తండ్రి — అలాంటి వాణ్ని భరించలేక—తాళిబొట్టుని తనకై తాను తెంచుకొని ధైర్యంగా జైలుకెళ్ళిన తల్లి—కూడుపెట్టని, అనామకుడి ప్రలోభానికి లొంగి ప్రాణం పోగొట్టుకున్న కొడుకు....

ఓహ్!! ఒక్క కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులకీ మూడు విరుద్ధ స్వభావాలు!!!

తెల్లవారుఝామున జిడ్డుగాడు వెక్కి వెక్కి ఎందుకు ఏడ్చాడు? ఎందుకలా దొంగతనంగా పరుగెత్తి బ్రవున్ కోటువాడి వివరాలు తెలుసుకున్నాడు? ఎందుకు హత్య చేయబడ్డాడు?...ఆలోచిస్తే నెమ్మదిగా అర్థంకాసాగింది.

బహుశ డబ్బుల కాశపడి ఈ పాడుపనికి ఒప్పుకొని ఉంటాడు. తీరా అనిత సునీతే—అంటే నా చెల్లెలే కూచుంది. నా చెల్లెలని వాడికి తెలిశాక వాడి చేతులా ఆ విషాన్ని కలిపి ఆమెని చంపబోయిన సంఘటన గుర్తుకి తెచ్చుకొని నా కన్నం పెడుతున్నవాడి తోడబుట్టిందాన్నే చంపబోయినందుకు పశ్చాత్తాప సూచనగా ఏడుపు వచ్చి వుంటుంది. అందుకే వాణ్ని కలిసి నన్ను మభ్యపెట్టి కొత్త జంటకు విషం కలపమని యిస్తావా? అని

అడిగి అమాయకంగా పోలీసులకి తెలియజేస్తానని బెదిరించి వుంటాడు. వాళ్ళు ఇలా వాడి నోరు మూశారు.

కారు ఒక్క కుదుపుతో ఆగిపోయింది. హాపూర్ నగర్ దాటి — ఊరి బయటకి వెళ్ళాక ఓ కిలోమీటరు దూరంలో.

ఓ కారు — నల్లని — నంబరులేని అంబాసిడర్ — వేగంగా దూసుకుపోతూ ఓ మూటని పెట్టేసిందనీ దగ్గరగా వెళ్ళి చూస్తే అది శవమనీ చూసినవాళ్ళు చెప్పారు.

చక్రవర్తి శవంవద్దే ఉన్నాడు. యెలాంటి 'క్లూ' లభించలేదు. గొంతుపిసికి చంపారు జిడ్డుగాణ్ని.

జిడ్డుగాణ్ని ఆ స్థితిలో చూస్తుంటే యేడుపాగలేదు నాకు. జలంధర్ కూడా సానుభూతిగా నిట్టూర్చాడు.

“చక్రవర్తీ! హంతకుడెవరో నాకు తెల్సు. కాని వాడి దగ్గరికి అరెస్టువారంట్‌తోనే వెళ్ళాలి. త్వరగా సిద్ధంచేయించు” అన్నాడు జలంధర్.

13

ఒక్క జర్కుతో బృందావన్ బార్ ముందు ఆగాయి డాడ్జికారూ పోలీసు జీపూ. బిలబిలమంటూ అందరూ దిగారు.

నేరుగా కౌంటర్ వైపు నడిచాడు జలంధర్.

“శశికిరణ్ ఎక్కడ?” అధికారయుతంగా ప్రశ్నించాడు.

“లేడు సార్! వచ్చేవారం వస్తాడు.”

“అతడు వారానికోసారి మాత్రమే వస్తాడని, మీ బార్‌లో అతడు సైలెంట్ పార్టనర్ అనీ మాకు తెలుసు. అంతేకాదు, ఇందాకే అతడు లోనికి వెళ్ళటం మేము నియోగించిన మనుషులు గమనించారు. మా వద్ద

అరెస్టు వారంట్ వుంది. యిప్పుడూ అబద్ధమే చెప్పా వంటే తర్వాత చాలా చింతిస్తావ్, చెప్పు. శశికిరణ్ ఉన్నాడా లోపల?" చక్రవర్తి గద్దించాడు.

"ఉన్నాడు సార్!!" భయంగా చెప్పాడు కౌంటర్ లోని వ్యక్తి. యింతమందిని తప్పించుకోవటం సాధ్యం కాక సులభంగా లొంగిపోయాడు శశికిరణ్.

శశికిరణ్, శరత్ బాబు—అంటే మా బావ—క్లోజ్ ఫ్రెండ్స్. శశికిరణ్ కి ఓ అందమైన చెల్లెలుంది. అన్ని తిరుగుళ్ళూ నేర్చిన ఆడది. ధనవంతుడైన శరత్ బాబుని వల్లో వేసుకోవటంకోసం ఆమెని నియమించాడు. ఈ విషయం శరత్ బాబు గ్రహించి అతనికీ అతని చెల్లెలికీ దూరంగా వుంటూ వచ్చాడు.

శశికిరణ్ ఆగ్రహించాడు. సమయంచూసి వెన్నుపోటు పొడవాలని స్నేహం నటిస్తూ వచ్చాడు.

ఈలోగా శరత్ బాబు బిజినెస్ పనిమీద బొంబే వెళ్ళాడు, నా చెల్లెలుపాలిటి దేవుడు కావటంతో—ఓ అనామకురాలు యిలా ఐశ్వర్యవంతురాలైనందుకు ఆమె మీద, తన చెల్లిని తృణీకరించినందుకు శరత్ మీద పగ బట్టాడు.

జిడ్డుగాణ్ని మచ్చికచేసుకొని—అనిత తన చెల్లెలనీ, బావగా శరత్ నీ అతని భార్యగా అనితనీ ఏడిపించటం కోసం అయిదు నిమిషాలు మత్తుగా పడిపోయే మందని చెప్పి వాళ్ళిద్దరికోసం స్పెషల్ గా చేసిన 'హ్యూజ్ జాంగ్రీ రౌండ్స్'పై మాత్రమే చల్లమని చెప్పాడు.

కాని అనిత నా చెల్లెలని తెల్సిన జిడ్డుగాడు ఆవేశంగా శశికిరణ్ ని కల్సి మత్తుమందని చెప్పి విషమిచ్చి వందుకూ అనిత నా చెల్లెలని వెల్లడైనందుకూ సంజాయిషీ

కోరి మూర్ఖంగా శశికిరణ్‌ని పోలీసులకి పట్టిస్తానని బెదిరించాడు.

పిల్ల కాకికేం తెలుసు ఉండేలు దెబ్బ?

అందుకే ఆ దెబ్బ ఏదో తిన్నాడు, శశికిరణ్ చేతిలో.

శశికిరణ్ చాల తెలివిగా వ్యవహరించాననుకున్నాడు. బృందావన్ బార్‌లో సైలెంట్ పార్ట్‌నర్‌లాగే అనిత శరత్‌బాబుల హత్యాప్రయత్నంలో, జిడ్డుగాడి హత్యలో సైలెంట్ మర్డర్‌గానే వుండిపోదామనుకున్నాడు.

కాని జలంధర్‌గారి దర్యాప్తులో శరత్‌బాబువల్ల సేకరించిన శశికిరణ్ చెల్లెలికీ శరత్‌కీ అతను పెట్టాలనుకున్న ముడి, అది తిరగబడిన విషయమూ, నా దర్యాప్తులో కిరాణాకొట్టు శెట్టి, కిళ్ళీకొట్టు కుర్రాడూ చెప్పిన శశికిరణ్ వివరాలూ గుర్తులూ శశికిరణ్‌ని నేరస్థుడిగా హంతకుడిగా పట్టిచ్చాయి.

నేను నిర్దోషిగా ఋజువైనాను.

* * *

“సార్! మీకు ఋణపడి వున్నాను. మీ ఫీజెంతో సెలవిస్తే....” నసిగాను, ఆనందంతో.

చిరునవ్వు నవ్వాడు జలంధర్. “నేను డబ్బు ఆశించి ఈ కేసులో పని చెయ్యలేదు. ఆ అమ్మాయి అభ్యర్థనే నాకు ప్రేరణ. నీకు వృత్తిపరంగా చెడ్డపేరు రాకుండా యివాళే పత్రికలకు అన్ని వివరాలూ పంపుతాను” అన్నారు, పద్మవైపు చూస్తూ.

“అంతటితో నాకు తృప్తికలగదు సార్! ఆనాడు నన్ను కోపోద్రేకాలతో చూసిన వాళ్ళంతా—అదే.... మా బావ వారి స్నేహితులంతా నన్ను మళ్ళీ అభిమానించాలి. అంచేత నా స్వంత ఖర్చుతో మళ్ళీ విందు

ఏర్పాటు చేస్తాను. మీరు ఛీఫ్ గెస్టుగా రావాలి" అన్నాను.

"యింకా ఈ వంటలెందుకన్నయ్యా! మీరందరూ మాతో నే ఉండండి" అంది నా చెల్లెలు.

"వద్దమ్మా! నా వృత్తి ధర్మాన్ని నేను నిర్వహిస్తూ నలుగురికీ అన్నం పెట్టడంలో నే నాకు తృప్తి. నువ్వు సుఖంగా ఉన్నావు. వుంటావు. అంతే చాలు" అని జలంధర్ నీ, చక్రవర్తినీ చూస్తూ "సార్! రేపే ఫంక్షను. మర్చిపోరు కదూ! అంతేకాదు. జలంధర్ గారి వివాహాని కూడా నేనే ఛీఫ్ గెస్టుని—సారీ—వంటలయ్యని" అన్నాను నవ్వుతూ.

అందరూ గట్టిగా నవ్వారు.

అంత ఆనందంలోనూ జిడ్డుగాడు గుర్తువచ్చి, అందరి కనులూ చెమ్మగిల్లాయి.

—: అయిపోయింది :—